
# ప్రశ్నిస్తే సంకెళ్లా?





ప్రజాపాలన అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ప్రజల ఎజెండాను పూర్తిగా అటకెక్కించి, కక్షపూరిత రాజకీయాలపైనే దృష్టిపెట్టింది. ప్రజాసమస్యలపై నిలదీస్తున్న బీఆర్ఎస్ లీడర్లు, మద్దతుదారుల గొంతు నొక్కేందుకు పోలీసు కేసులను అస్త్రాలుగా మార్చుకున్నది. క్యాడర్‌ను బెదిరించి లీడర్‌ను దారిలోకి తెచ్చుకునే కుట్రలను అమలు చేస్తున్నది. గులాబీ జెండాను గుండెలకు హత్తుకొని బీఆర్ఎస్ వెంటే నడుస్తున్న కార్యకర్తలు, సర్కారు ఎంత వేధిస్తున్నా తట్టుకొని నిలబడుతూ ఉద్యమ స్ఫూర్తిని రగిలిస్తున్నారు. కాంగ్రెస్ సర్కారు కక్ష సాధింపు చర్యలు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తల వరకే పరిమితం కాలేదు. ఒకవేళ వాళ్లు దారికి రాకుంటే కుటుంబాలను సైతం వేదనకు గురిచేస్తూ అధికార పార్టీ రాక్షసానందం పొందుతున్నది. ఎవరిపైనా శత్రుత్వం లేదంటూనే ఏదో ఒక కారణం చూపి, సాక్ష్యాలు, ఆధారాలు లేకున్నా గులాబీదండును భయపెట్టి లొంగదీసుకునేందుకు రేవంత్‌రెడ్డి అండ్ కో ఆడుతున్న రాక్షస క్రీడ పరాకాష్టకు చేరిందనేందుకు ఈ ఉదంతమే సాక్ష్యంగా నిలిచింది.

*హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ):*

## అక్రమ కేసులు బనాయించి..

హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం రెడ్డిపురం గ్రామానికి చెందిన దుగ్గెంపూడి రంజిత్‌రెడ్డి, 2009 నుంచి వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ వెంట నడుస్తున్నాడు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసిన రంజిత్‌రెడ్డి, ఆ తర్వాత వరంగల్ పశ్చిమంలో గులాబీ జెండాను ఎగరేసేందుకు శాయశక్తులా కృషి చేశాడు. సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటూ వినయ్‌భాస్కర్ కార్యక్రమాలపై ప్రచారం చేస్తున్నాడు. ఇదే నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన నాయిని రాజేందర్‌రెడ్డి తన ప్రత్యర్థి వినయ్‌భాస్కర్‌ను దెబ్బతీయడమే లక్ష్యంగా రంజిత్‌రెడ్డిని టార్గెట్ చేసినట్టు తెలుస్తున్నది. రంజిత్‌ను పలు క్రిమినల్ కేసుల్లో ఇరికించేందుకు కుట్ర పన్నారు. కేయూ పోలీస్‌స్టేషన్‌కు పిలిచి వేధించడం, ఆ తర్వాత హనుమకొండ ఏసీపీ దగ్గరకు పిలిచి వార్నింగ్ ఇవ్వడం వంటి ప్రయత్నాలు చేశారు. ఇవి విఫలం కావడంతో రంజిత్ కుటుంబాన్ని కూడా ఇందులోకి లాగారు.

దారిలోకి రాలేదని కుటుంబానికీ శిక్ష

వరంగల్‌లో బీఆర్ఎస్ నేత రంజిత్‌రెడ్డిపై రేవంత్‌రెడ్డి సర్కారు వేధింపుల పర్వం

లీడర్‌ను దెబ్బ కొట్టేందుకు క్యాడర్ టార్గెట్

తల్లి, అక్కపైనా అక్రమ కేసుల బనాయింపు

'పెద్దల' ఆదేశాలే శిరోధార్యంగా పోలీసులు

కరోనా కాలంలో చనిపోయిన వ్యక్తిపైనా కేసు

# బీఆర్ఎస్ సైనికుడిపై సర్కారు కక్ష

### వివాదంలోకి ఉసిగొల్పి..

రెడ్డిపురంలోని రంజిత్‌రెడ్డి భూమి విషయంలో కోర్టులో కేసులు నడుస్తున్నాయి. దీన్ని ఆధారంగా చేసుకున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి తన అనుచరుడు రజనీకర్‌రెడ్డిని వివాదంలోకి ఉసిగొల్పారు. వివాదంలో ఉన్న భూమిని కబ్జా చేయాలని ప్రోత్సహించారు. ఉల్టా రంజిత్‌రెడ్డిపైనే కేసులు పెట్టి మానసిక క్షోభకు గురి చేస్తున్నారు. ఇదంతా రంజిత్‌రెడ్డిని బీఆర్ఎస్‌కు దూరం చేసే కుట్రలో భాగమేనని స్థానికంగా చర్చ నడుస్తున్నది. ఎన్ని వేధింపులకు గురిచేసినా రంజిత్‌రెడ్డి వెనక్కి తగ్గకుండా గుండెధైర్యంతో ముందుకు పోతున్నాడు. రంజిత్‌రెడ్డిని దారికి తెచ్చుకోవడం కోసం చివరికి ఆయన తల్లి టేకులమ్మ, అక్కపైనా కేసులు పెట్టి పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిప్పుతున్నారు. రాజకీయ ఒత్తిళ్లతోనే కేసులు పెడుతున్నట్టు పోలీసువర్గాల్లోని కొందరు అధికారులు బాహాటంగానే చెప్తున్నారు.

### చనిపోయిన వ్యక్తిపై కేసు!

రంజిత్‌రెడ్డిని వేధించే క్రమంలో పోలీసులు తప్పుల మీద తప్పులు చేస్తున్నారు. చనిపోయిన వ్యక్తులపైనా కేసులు నమోదు చేసి ప్రభుత్వ పెద్దలపై తమ విధేయతను చాటుకుంటున్నారు. నిరుడు సెప్టెంబర్ 4న కేయూ పీఎస్‌లో నమోదైన ఎఫ్ఐఆరే ఇందుకు నిదర్శనంగా నిలిచింది. ఎఫ్ఐఆర్ (నంబర్ 440/2024 తేదీ:04-09-2024)లో మురికి అనంతలక్ష్మి అనే మహిళతో పాటు కొందరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంజిత్‌రెడ్డి, మర్రెడ్డి, టేకులమ్మ, ఆమె కూతురు వాణి, ఆదూరి చల్మారెడ్డి, వెంకట ఫణీంద్రయాదవ్‌పై పోలీసులు దాడి కేసు నమోదు చేశారు. ఇందులో ఆదూరి చల్మారెడ్డి కరోనా సమయంలోనే 2020, ఆగస్టు 30న చనిపోయాడు. చనిపోయిన వ్యక్తిపై నాలుగేళ్ల తర్వాత కేసులు పెట్టడం, కనీసం విచారణ కూడా చేయకుండా ఇష్టం వచ్చినట్టుగా కేసులు నమోదు చేయడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు ఎఫ్ఐఆర్‌లో దాడి జరిగిన తేదీ 2024, సెప్టెంబర్ 4గా పోలీసులు నమోదు చేయగా, 2024, మే 26న తనపై దాడి జరిగిందని ఫిర్యాదుదారు కంప్లయింట్‌లో పేర్కొన్నారు. అంటే ఫిర్యాదు అందకముందే కేసు నమోదైందని స్పష్టమవుతున్నది. ఎమ్మెల్యే ఏం చెప్తే అదే చేస్తున్నారని, ఈ వ్యవహారంపై విచారణ చేస్తామని ఓ పోలీస్ ఉన్నతాధికారి మహిళా కమిషన్ ముందు చెప్పారు.

### సాక్షుల తారుమారు!

పోలీసులు రంజిత్‌రెడ్డిపై పెట్టిన మొదటి కేసులో కొందరు బీఆర్ఎస్ కార్యకర్తలను సాక్షులుగా పేర్కొన్నారు. ఈ విషయం సదరు సాక్షులకు కూడా తెలియదు. తప్పుడు కేసులో తమను సాక్షులుగా చేర్చడమేమిటని పోలీసులను ప్రశ్నించారు. ఇదంతా బీఆర్ఎస్‌లో అలజడి సృష్టించేందుకు కాంగ్రెస్ నేతలు, పోలీసులు ఆడుతున్న నాటకమని గులాబీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ కార్యకర్తలు తప్పుడు సాక్ష్యం చెప్పేందుకు నిరాకరించారు. దీంతో రంజిత్‌రెడ్డిపై పెట్టిన రెండో కేసులో వారిని నిందితులుగా చేర్చారు. వివరాల్లోకి వెళ్తే ఎఫ్ఐఆర్ నం. 440/2024కు సంబంధించిన ఫిర్యాదులో వినోద్, నరేందర్, రాకేశ్‌యాదవ్‌లను సాక్షులుగా చూపించారు. మార్చి 18న మురికి కొండయ్య అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నం.157/2025, తేదీ.18.03.25లో వినోద్ అనే వ్యక్తిని ఏ1గా, దుగ్గెంపూడి రంజిత్ అక్క, ఇతరులు అంటూ ఏ-2గా చూపించారు. ఇందులో వినోద్ గతంలో రంజిత్‌పై ఫిర్యాదు చేసిన మురికి అనంతలక్ష్మి ఫిర్యాదులో సాక్షిగా ఉన్నారు. ఇక్కడ ట్విస్ట్ ఏమిటంటే సాక్షులు ముగ్గురు అసలు తమకు ఆ ఘటనతో సంబంధం లేదని, తాము లేకున్నా తమ పేర్లు పెట్టారని స్పష్టంచేశారు. రంజిత్‌రెడ్డితో కలిసి బీఆర్ఎస్‌లో ఉన్నారు కాబట్టి అందరినీ ఒకేసారి టార్గెట్ చేయొచ్చనే లక్ష్యంతో ఈ పనిచేశారని సాక్షులే చెప్తున్నారు.






### డయల్ 100కు ఫోన్‌చేస్తే ఉల్టా కేసులు

ప్రస్తుతం వరంగల్ పశ్చిమం నుంచి నాయిని రాజేందర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన గతంలో వినయ్‌భాస్కర్ చేతిలో ఓడిపోయారు. ఆ ఓటమికి వినయ్‌భాస్కర్ అనుచరుడు రంజిత్‌రెడ్డి కూడా కారణమనే పగతోనే నాయిని ఇదంతా చేస్తున్నాడని నియోజకవర్గవ్యాప్తంగా చర్చ జరుగుతున్నది. ఎట్టిపరిస్థితుల్లోనూ రంజిత్‌రెడ్డిని చంపేస్తానని తన అనుచరుల వద్ద రాజేందర్‌రెడ్డి చెప్పాడని రంజిత్‌రెడ్డి ఆరోపిస్తున్నాడు. తనకు ప్రాణభయం ఉన్నదని, హైదరాబాద్‌కు వచ్చి ప్రశాంతంగా ఉంటే తన కుటుంబాన్ని టార్గెట్ చేశారని ఆవేదన వ్యక్తంచేస్తున్నాడు. భూమి విషయంలో కోర్టులో కేసు నడుస్తున్న సమయంలో కొందరు వ్యక్తులు వచ్చి ఆ స్థలంలో రాద్ధాంతం చేస్తుంటే మూడుసార్లు ఫిర్యాదు చేశామని, ప్రతిసారీ తమపైనే ఉల్టా కేసులు పెడుతున్నారని రంజిత్‌రెడ్డి తల్లి టేకులమ్మ, అక్క రత్నమేరీ కన్నీటిపర్యంతమవుతున్నారు. తమపై దాడులు చేసేందుకు ప్రయత్నిస్తున్న వారిని సీఐ రవికుమార్ కాపాడుతున్నారని తెలిపారు. తమ జాగ మీదకు దుండగులు వచ్చినప్పుడు డయల్ 100కు కాల్ చేసినా ఫలితంలేదని, రెండు సార్లు తాము ఫిర్యాదు చేస్తే తమకు న్యాయం చేయకుండా వాళ్ల ఫిర్యాదు మేరకు తమపైనే కేసులు పెట్టారని విలపిస్తున్నారు. మహిళ అని కూడా చూడకుండా తనపై రౌడీషీట్ ఓపెన్ చేస్తానంటూ సీఐ రవికుమార్ బెదిరించారని రత్నమేరీ వాపోయారు. ఈ మేరకు తాను మహిళా కమిషన్‌ను ఆశ్రయించానని తెలిపారు.

## "ఎన్‌కౌంటర్ చేస్తమని బెదిరించిండ్రు

నేను తెలంగాణ ఉద్యమంలో పనిచేయడమే తప్పైందా? ప్రత్యేక తెలంగాణ కోసం పోరాటం చేసిన బీఆర్ఎస్ కార్యకర్తగా కొనసాగడమే నేరమైందా? నన్ను, నా కుటుంబాన్ని టార్గెట్ చేసి అక్రమ కేసులు బనాయించిండ్రు. చనిపోయిన వారిపై కూడా కేసులు పెట్టి పైశాచికానందం పొందుతున్నరు. స్థానిక ఎమ్మెల్యే తన అధికార బలంతో పోలీసులను ప్రయోగించి పెట్టిన కేసులు, చేస్తున్న వేధింపులతో చాలా ఇబ్బంది పడుతున్నం. ఊరిలో ఉండలేక ఎటూ పోలేక, ఆత్మాభిమానం చంపుకోలేక నలిగిపోతున్నం. ఇన్నాళ్లు స్వేచ్ఛగా తిరిగిన తెలంగాణలో మళ్లీ బానిసలుగా బతకాల్సిన పరిస్థితులు వచ్చినయి. ఒంటరి మహిళలైన నా తల్లి, అక్కమీద కూడా కేసులు పెట్టి, నా సొంత భూమి విషయంలో కోర్టులో కేసులు నడుస్తుండగానే రౌడీలకు వత్తాసు పలుకుతూ, కబ్జాలు, దాడులు చేయిస్తున్నరు. ఉల్టా మాపైనే పోలీసులు కేసులు పెడుతున్నరు. ఆడోళ్లపై రౌడీ షీట్లు ఓపెన్ చేస్తామని బెదిరిస్తున్న సీఐ రవికుమార్‌కు అసలు మహిళలంటేనే గౌరవం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి ఫస్ట్ టార్గెట్ నేనే. పోలీసులు చెప్తున్న మాట ఒక్కటే..నీకు ఎమ్మెల్యే గారితో పంచాయితీ ఏంది? నువ్వు ఊరు వదిలిపెట్టిపో. నీ ఇల్లు వదిలిపెట్టి ఎక్కడికైనా కనిపించకుండా వెళ్లిపో. లేకపోతే నిన్ను ఎన్‌కౌంటర్ చేస్తం. అని బెదిరించిండ్రు.

**- దుగ్గెంపూడి రంజిత్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గం**

# అక్కసుతో ఎఫ్ఐఆర్..

**ఎత్తిన గొంతులను నొక్కేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. కేటీఆర్ సహా క్యాడర్ వరకు వందలాది ఎఫ్ఐఆర్‌లు.. సోషల్ మీడియాలో సైతం ప్రశ్నించే హక్కు కాలరాత**

**ఇప్పటికే వందల కేసులు పెట్టిన రేవంత్ సర్కారు.. కొణతం దిలీప్‌పై 12, గౌతమ్‌పై 8 కేసుల నమోదు.. సోషల్ మీడియా యాక్టివిస్టులే లక్ష్యంగా వేధింపులు**





హైదరాబాద్, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ): ప్రజాపాలన అంటూనే కాంగ్రెస్ సర్కారు తన వైఫల్యాలపై అదే ప్రజలు అడిగే ప్రశ్నలకు బెదురుతున్నది. బదులుచెప్పే ధైర్యంలేక అడ్డదారిలో పోలీసులతో 'ఎఫ్ఐఆర్' ఫైల్ చేయిస్తున్నది. ప్రజాస్వామిక హక్కుల కోసం గొంతెత్తేవారిని వేధిస్తూ పోలీసు పాలన సాగిస్తున్నది. సోషల్‌మీడియా యాక్టివిస్టులపై అడ్డగోలుగా కేసులు బనాయిస్తున్నది. అదునుచూసి అరెస్టు చేయిస్తున్నది. ప్రజలు తమ ఆవేదన వెళ్లగక్కినా.. ఎవరైనా వెలుగులోకి తెచ్చినా.. వాటిపై సోషల్ మీడియాలో పోస్టు పెట్టినా.. సామాజిక మాధ్యమాల్లో మాట్లాడినా కేసులు పెట్టిస్తున్నది. బీఆర్ఎస్ కార్యకర్తల నుంచి సామాన్య ప్రజలు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వరకు ప్రశ్నించేవారిని ఎవ్వరినీ వదలడం లేదు. అదును దొరికితే చాలు.. ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు పోలీసులూ వెనుకాడటం లేదు.

### ముందే కేసులకు సిద్ధమై..

ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరై ప్రజల తరపున అధికారపార్టీ నాయకులను ప్రశ్నించే బీఆర్ఎస్ నేతలపై కేసులు పెట్టేందుకు ముందే సిద్ధమవుతున్నట్టు స్పష్టమవుతున్నది. ఓ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను నిలదీస్తే బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిపై ఫోర్జరీ కేసు పెట్టారు. హైదరాబాద్‌లో తమను కిడ్నాప్ చేసేందుకు కొందరు యత్నించారని ఫిర్యాదు చేసేందుకువెళ్లిన పీర్జాదిగూడ మాజీ మేయర్, బీఆర్ఎస్ నాయకుడు జక్కా వెంకట్‌రెడ్డితోపాటు పదిమందిపై ఉల్టా కేసులు నమోదు చేశారు. ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేయాలంటూ ఆందోళన చేపట్టిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిపై కేసు పెట్టారు. తప్పుడు పత్రాలతో స్థలం కబ్జా చేయడానికి యత్నించారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి దంపతులపై రాజకీయ ప్రోద్బలంతో ఘట్కేసర్ ఐటీ కారిడార్ పీఎస్‌లో కేసు నమోదు చేశారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై జనగామలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద కేసు నమోదు చేశారు. 2023 నవంబర్ 30న కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేస్తే 2024 జూన్ 3న 188, 130 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారంటే రాష్ట్రంలో కాంగ్రెస్ చెప్పినట్టుగా పోలీసులు ఆడుతున్నారనే విమర్శలు నిజమని స్పష్టమవుతున్నది. భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి దంపతులపై అక్రమంగా కేసులు బనాయించారు. పెద్దపల్లి జిల్లాలో సల్వాజీ మాధవరావు అనే బీఆర్ఎస్ కార్యకర్తపై కాంగ్రెస్ నేతలు నాలుగు సార్లు దాడులు చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఫామ్‌హౌస్‌లో కోడిపందేలు నిర్వహించారన్న కాంగ్రెస్ ఫిర్యాదుతో పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఓ నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసేందుకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు పోలీసులు నోటీసులిచ్చారు. ఆయన నెత్తుటి గాయాలతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయలేదు. నారాయణపేటలో ఎమ్మెల్యే ఎవరో తెలియడం లేదంటూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ఇర్ఫాన్‌పై కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డి పరువు ప్రతిష్టలకు భంగం కలిగించేలా పోస్ట్ పెట్టారంటూ ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్‌పై సోషల్ మీడియాలో మార్ఫింగ్ వీడియోలు పోస్ట్ చేశారని నర్సింహులపేటలో గుగులోత్ హచ్చు, చిదిమిళ్ల యుగంధర్, గుగులోత్ లక్‌పతి, వాంకుడోత్ అశోక్, సుమంత్‌పై కేసులు నమోదయ్యాయి.

### యాక్టివిస్టులే టార్గెట్‌గా కేసులు

సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్‌గా ఉంటూ, ప్రజలను చైతన్యవంతుల్ని చేస్తున్న వారినే ప్రభుత్వం టార్గెట్ చేస్తున్నట్టుగా తెలుస్తున్నది. 'ఎక్స్‌లో కొణతం దిలీప్ ఓ పోస్టు పెట్టారు.. చర్యలు తీసుకోగలరు' అనే రెండు పదాలను ఫిర్యాదులో ఓ కాంగ్రెస్ నాయకుడు రాస్తే దానిపై ఎలాంటి విచారణ చేయకుండానే దిలీప్‌పై కేసు నమోదు చేశారు. కొణతం దిలీప్‌పై ప్రస్తుతం 12 కేసులు నమోదయ్యాయి. ఇక బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్‌పై నమోదైన 10కి పైగా కేసుల్లో సోషల్ మీడియావే 3 ఉన్నాయి. మరో సోషల్ మీడియా యాక్టివిస్టు గౌతమ్ పోతగోనిపై 8 కేసులు, అశోక్‌రెడ్డిపై 3 కేసులు.. నల్లబాలు అనే అకౌంట్ మీద మరో 3 సైబర్ క్రైమ్ కేసులు నమోదయ్యాయి. ఇటీవల బండి సంజయ్ ఫిర్యాదు మేరకు నలుగురు సోషల్ మీడియా యాక్టివిస్టులపై కేసు నమోదు చేశారు.

### తినే పళ్లెం తీసేసి..



2025 మార్చి 19.. మధ్యాహ్నం పొలానికి వెళ్లొచ్చిన 77 ఏండ్ల వృద్ధ దంపతులు అప్పుడే అన్నం తినేందుకు ఇంట్లో కూర్చున్నారు. కష్టసుఖాలు పంచుకుంటూ తలో ముద్ద తింటున్నారు. అంతలోనే 'ఏయ్ వెంకటయ్యా.. ఇటురా.. లెవ్.. నువ్వేనా సీఎంను తిట్టింది' అంటూ వచ్చీ రాగానే తినే పళ్లాన్ని పక్కకు నెట్టి అత్యంత దారుణంగా రెక్కలు మడిచి వాహనంలో వేసుకొని పోలీస్ స్టేషన్‌కు లాక్కెళ్లారు. ఆ బాధిత వృద్ధుడి పేరు దర్శనం వెంకటయ్య. పేద, దళిత రైతు. మహబూబాబాద్ జిల్లా, ఇనుగుర్తి మండలం, చిన్నముప్పారం గ్రామం. అతనికి మూడెకరాల అసైన్డ్ భూమి ఉండేది. అందులోనే వ్యవసాయం చేసుకుంటూ బతికేవాడు. ఆ భూమిని ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా లాక్కున్నది. ఆ భూమిని తనకు తిరిగి ఇప్పించాలని మహబూబాబాద్ నుంచి హైదరాబాద్‌కు వచ్చి అధికారులకు గోడు వెళ్లబోసుకున్నాడు. హైదరాబాద్‌కు వచ్చిపోతున్న క్రమంలో ఓ యూట్యూబ్ చానల్‌లో రేవంత్ సర్కారు తీరుపై వెంకటయ్య మండిపడ్డాడు. ఇది కాస్తా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కడుపుమండి వెంకటయ్య మాట్లాడిన మాటలు ఈ ప్రభుత్వానికి నచ్చలేదు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.



### కేటీఆర్‌పై కేసుల వివరాలు

| తేదీ | ఎఫ్ఐఆర్ | పోలీస్‌స్టేషన్ |
|---|---|---|
| 2024 ఆగస్టు 21 | 321/2024 | సైఫాబాద్ |
| 2024 అక్టోబర్ 14 | 205/2024 | ఉట్నూర్ |
| 2025 మార్చి 15 | 51/2025 | మొయినాబాద్ |
| 2025 మార్చి 25 | 85/2025 | నకిరేకల్ |
| 2025 మార్చి 25 | 86/2025 | నకిరేకల్ |
| 2025 మార్చి 25 | 87/2025 | నకిరేకల్ |

### హరీశ్‌పై కేసులు

| తేదీ | ఎఫ్ఐఆర్ | పోలీస్‌స్టేషన్ |
|---|---|---|
| 2024 ఆగస్టు 22 | 242/2024 | యాదగిరిగుట్ట |
| 2024 అక్టోబర్ 4 | - | సైబర్ క్రైం |
| 2024 అక్టోబర్ 25 | - | కరీంనగర్ |
| 2024 నవంబర్ 7 | 454/2024 | కరీంనగర్ |
| 2024 డిసెంబర్ 3 | 1205/2024 | పంజాగుట్ట |
| 2025 ఫిబ్రవరి 28 | 177/2025 | బాచుపల్లి |

### కొణతం దిలీప్‌పై

| తేదీ | ఎఫ్ఐఆర్ | పోలీస్‌స్టేషన్ |
|---|---|---|
| 2024 మే 23 | 188/2024 | చిక్కడపల్లి |
| 2024 సెప్టెంబర్ 5 | 2138/2024 | సైబర్‌క్రైమ్ |
| 2024 సెప్టెంబర్ 28 | 2317/2024 | సైబర్ క్రైమ్ |
| 2024 సెప్టెంబర్ 28 | 104/2024_1 | నిర్మల్ లోకేశ్వరం |
| 2024 సెప్టెంబర్ 28 | 477/2024 | నిర్మల్ టౌన్ |
| 2024 సెప్టెంబర్ 28 | 478/2024 | నిర్మల్ టౌన్ |
| 2024 అక్టోబర్ 1 | 104/2024_2 | ముథోల్, నిర్మల్ |
| 2024 నవంబర్ 18 | 121/2024 | బాసర, నిర్మల్ |
| 2025 మార్చి 25 | 85/2025 | నకిరేకల్ |
| 2025 మార్చి 25 | 86/2025 | నకిరేకల్ |
| 2025 మార్చి 25 | 87/2025 | నకిరేకల్ |
| 2025 ఏప్రిల్ 3 | 631/2025 | గచ్చిబౌలి (హెచ్‌సీయూ అంశం) |

### మన్నె క్రిశాంక్‌పై

| తేదీ | ఎఫ్ఐఆర్ | పోలీస్‌స్టేషన్ |
|---|---|---|
| 2024 ఏప్రిల్ 30 | 207/2024 | ఉస్మానియా యూనివర్సిటీ |
| 2024 జులై 30 | 1848/2025 | సైబర్ క్రైమ్ |
| 2025 జనవరి 18 | 143/2025 | సైబర్‌క్రైమ్ |
| 2025 ఏప్రిల్ 3 | 621/2025 | గచ్చిబౌలి (హెచ్‌సీయూ అంశం) |
| 2025 ఏప్రిల్ 3 | 630/2025 | గచ్చిబౌలి (హెచ్‌సీయూ అంశం) |
| 2025 ఏప్రిల్ 3 | 631/2025 | గచ్చిబౌలి (హెచ్‌సీయూ అంశం) |
| 2025 ఏప్రిల్ 3 | 632/2025 | గచ్చిబౌలి (హెచ్‌సీయూఅంశం) |

### అశోక్‌రెడ్డిపై

| తేదీ | ఎఫ్ఐఆర్ | పోలీస్‌స్టేషన్ |
|---|---|---|
| 2025 మార్చి 16 | 6/2025 | సీసీఎస్, ఖమ్మం |
| 2025 మార్చి 16 | 9/2025 | సీసీఎస్,రామగుండం |
| 2024 సెప్టెంబర్ 28 | 2317/2024 | సైబర్‌క్రైమ్ |

### గౌతమ్ పోతగోనిపై

| తేదీ | ఎఫ్ఐఆర్ | పోలీస్‌స్టేషన్ |
|---|---|---|
| 2024 ఏప్రిల్ 24 | 1670/2024 | గచ్చిబౌలి |
| 2024 సెప్టెంబర్ 28 | 1118/2024 | వనస్థలిపురం |
| 2024 సెప్టెంబర్ 28 | 216/2024 | కార్ఖానా |
| 2024 సెప్టెంబర్ 28 | 2317/2024 | సీసీఎస్, హైదరాబాద్ |
| 2024 సెప్టెంబర్ 29 | 270/2024 | మంచాల |
| 2024 సెప్టెంబర్ 29 | 121/2024 | గ్రీన్ ఫార్మాసిటీ |
| 2024 నవంబర్ 5 | 1093/2024 | రాయదుర్గం |
| 2025 మార్చి 5 | 496/2025 | సీసీఎస్, హైదరాబాద్ |

### నల్లబాలుపై కేసులు

| తేదీ | ఎఫ్ఐఆర్ | పోలీస్‌స్టేషన్ |
|---|---|---|
| 2024 జులై 2 | 1622/2024 | సైబర్ క్రైమ్ |
| 2025 మార్చి 16 | 13/2025 | కరీంనగర్ |
| 2025 మార్చి 16 | 8/2025 | రామగుండం |